మారిన విలువలు

....పీతలు పరుగు పందేలు వేస్తున్నయ్. రాజు "ఆగరా ఆగు" అన్నాడు హఠాత్తుగా. ఆగి వాడి మొహంలోకి చూశాను. "అ ల్లక్కడ దొర్లుతూ పోతున్న మనుష్య శాల్తీని చూడు" అన్నాడు రాజు. ఏమిటోనని చూశాను. ఓ నల్లటి యువకుడు దొర్లుతున్నట్టు నడుస్తున్నాడు ఓ పుస్తకం చదువుతూను. అతను పుస్తకం పట్టుకున్న తీరుచూస్తే నవ్వొచ్చింది. కంటికి రెండంగుళాల దూరంలో ఉన్న ఆ పుస్తకం బరువు రెండు మణుగులకు తక్కువ ఉండదనిపించింది. పుస్తకం ధ్యాసలోపడి సముద్రంలోకి నడుస్తోంది ఆఆకారం.

"అరె! మోకాలులోతు నీళ్ళలో కెళ్లినా తెలియడం లేదు అతనికి. మనిషేనా!...." విస్తుపోయి చూస్తున్నాడు రాజు. నేనూ చూశాను. దూరాన్నుంచి ఓకెరటం శరవేగంతో వస్తోంది. రాజు పరుగెత్తాడు: 'ఏయ్ మిస్టర్! కెరటం వస్తోంది' అని అరిచాడు. ఆ ఆకారం మావేపు చూసి, చిరునవ్వుతో మాకళ్ళని గాయపరిచి తిరిగి నవ్వుతూ కదిలిపోయింది.

'ఆత్మహత్య!' అన్నాడు రాజు.

"పాపం అతను యూనివర్సిటీ స్థితి చూడలేక ఆత్మహత్య చేసుకుంటున్నాడు."

ఆ పుస్తకాల పురుగు ఇంకా లోతుకెళ్ళింది. ఇక ప్రమాదం తప్పదనిపించింది. పైజామా పైకిమడిచి, చెప్పులు విడిచి, నీళ్ళలోకిపోయి ఆమనిషి జబ్బ పట్టుకున్నాను. "లోపలికి పోతున్నారేం?" అన్నాను. "వాట్! వాట్!" అంటున్నాడు. "వాట్ డూ యూ మీన్ బై...." అన్నాడు. తెలుగు తెలియదని తెలిసింది.

"మీరు సముద్రంలోకి పోతున్నారు" ఇంగ్లీషులో అన్నాను.

"అవును. మీకెలా తెలిసింది" అతనూ ఇంగ్లీషులోనే అడిగాడు. నాకు నవ్వొచ్చింది.

"ఓమారు క్రిందికి చూడండి" అన్నాను. చూశాడు ఒణకడం మొదలెట్టాడు.

"వ..అఆటర్! ...వాటీజ్ ది మేటర్!" అన్నాడు అతి కష్టంమీద.

గట్టుమీదకి లాక్కొచ్చాను. అతను పైకొచ్చి ఏమీ జరగనట్టే పుస్తకం చదివెయ్యడం మొదలుపెట్టాడు. 'థేంక్సు చెప్పడేం!" అన్నట్టు చూశాడు రాజు. కొంతసేపు ఇద్దరం అతని పుస్తకపతనం వీక్షించాక రాజు అంటున్నాడు: "వెంట్రుకవాసిలో స్వర్గానికిపోయే మహదవకాశాన్ని పోగొట్టినందుకు అతనికి మనమీద కోపంగా ఉందేమో!" అన్నాడు.

ఆపుస్తకం ఏమిటోనని చూశాను. "అండర్ ది పసిఫిక్" అని రెండువేల పేజీల పుస్తకం

చిన్న అరటావు సైజు పుస్తకమంత ...

చీకటి పడుతోంది. దూరాన నడుస్తున్న అమ్మాయిలు నీడల్లాగా కనిపిస్తుంటే రాజా కళ్లు పొడుచుకు చూస్తున్నాడు. మా విచిత్ర వ్యక్తి ఇక చదవడం అసాధ్యం అని గుర్తించాడు. ఆఅలో చన అతనికి సుతరామూ కిట్టినట్టు కనిపించదు.

"అయ్యా! మీలో ఎవరివద్దనైనా కరవిద్యుద్దీపిక గలదా. నేనీదినమున 'చీకటి పడులోగా' నూరు పేజీలు మాత్రమే చదువవలసియున్నది ...." ఇంగ్లీషులో అర్థించాడు అతను. రాజా కీచుమని నవ్వాడు.

టార్చ్ లైటుతో బీచికి వచ్చే అలవాటు లేదనీ, ఆయన చదువుకి సహాయపడనందుకు విచారిస్తున్నామనీ విన్నవించుకున్నాం. అతను దుఃఖభారాన్ని మరిచిపోడానికి ప్రయత్నిస్తూ.

"మీరు ఏమి చదువుతున్నారు" అని అడిగాడు.

"నేనూ ఇంజనీరింగే" అని ఏడుస్తూ చెప్పాడు రాజా.

"నేనూ ఇంజనీరింగే" అతను నవ్వాడు. సింహాచలం కొండమీంచి నీళ్లతో ఉన్న ఓ చెంబు దొర్లిపోతే అదే ధ్వని రావడం నేను చెవులారా విన్నాను. అది జ్ఞాపకం వచ్చి 'హతోస్మి' అనుకున్నాను.

కుప్పుస్వామి (అతని పేరు)కి ఇంగ్లీషు బాగా వచ్చునని గ్రహించాను. అతని ఇంగ్లీషు కర్ణకఠోరంగా ధ్వనించినమాట కాదనలేను. కాని అది కాగితం మీద చాలా బావుంటుంది. అందుచేత అతనంటే సదభిప్రాయం ఏర్పడింది నాకు.

వెన్నెల వచ్చింది.

ముగ్గురం సముద్రంలోకి చూస్తున్నాం.

"మీరు మారూంలో చేరతారా?" తెలుగులో అనేశాను అలవాటుకొద్దీ. రాజా గతుక్కుమన్నాడు. తనకు భరించరాని అవమానం జరిగిపోయినట్టు భావించాడు. 'ఊరుకో'మన్నట్టు చూశాడు. "ఏమిటి! ఏదో రూము అంటున్నట్టున్నారు. నేను ఏరూంలోనూ చేరలేదు. ఎవరూ తెలిసినవాళ్లు లేరు" అన్నాడతను. రాజా "ససేమిరా, రానివ్వ"నన్నాడు నాతో! 'ఒరే! నేనూరుకోను. ఏంచేస్తానో తెలుసా! ఊఁ, ఏం చేస్తానో తెలుసా! ఇతనంటే ఎంత అసహ్యంఅంటే? ఎంతంటే ...ఎంతో అసహ్యం ...అంత అసహ్యం అన్నమాట." తగిన పదజాలం దొరక్క ఇబ్బంది పడుతున్నాడు.

నాకు చెప్పి లాభంలేదని గ్రహించాడు రాజా. అతనికి చెప్పసాగాడు: "ఇంజనీరింగు వాళ్లకి ప్రకృతితో సరాసరి సంబంధం ఉండాలని భావించి చక్కగా పంచభూతాలకు ప్రవేశమున్న గదులుమాత్రమే వాళ్లకి కేటాయించారు..."

"నాకు ప్రకృతి అంటే చాలాఇష్టం." అన్నాడతను. రాజా నిర్ఘాంతపోయాడు. అతను తమిళుడేనా అని అనుమానిస్తున్నట్టు కనిపించాడు. గుటకలు మింగాడు. నాకు నవ్వొస్తోంది, వాడిస్థితి చూస్తే. దూరంగా పోయి నవ్వుకుంటున్నాను. వాళ్లు ఏదో మాట్లాడుకుంటున్నారు.

పావుగంట గడిచాక రాజొక్కడు వచ్చాడు. విజయగర్వం వాడి పెదవులమీద పరవళ్లు

తొక్కుతోంది. 'శని ఒదిలింది' అన్నాడు వాడు. 'ఏం' అన్నాను. 'అతను మనరూంకి రానన్నాడు' అన్నాడు.

వాడి ఆనందం చూస్తే చాలా బాధ కలిగింది నాకు. "ఎక్కడుంటాడు పాపం?" అన్నాను. "అదే నేనూ అడిగాను. టౌన్లో ఓ హోటల్లో ఉంటున్నాడుట. అక్కణ్ణుంచి దూరం కాదా అన్నాను. అతను రెండు మైళ్లు ఓదూరం కాదన్నాడు. ఓపుస్తకం చదువుకుంటూ రోడ్డుపక్కని నడిచిరావడం యేంకష్టం కాదన్నాడు. పైగా అందులో ఎంతో హాయి ఉందన్నాడు. అదే మంచిదని సమర్థించాను నేను," అన్నాడు, తన ప్రతిభకు గర్విస్తూ. "ఏడవలేకపోయావు" అన్నాను. ఓ రాజకీయ నాయకుణ్ణి పదిమందిలోనూ పట్టుకుని "నీకు కులతత్వం తెలియదు", అనేస్తే ఎంత బాధపడతాడో అంతబాధా అనుభవించాడు రాజు. మూతి ముందుకు పొడుచుకొచ్చింది.

"అతనంటే అవ్యాజద్వేషం ఏర్పడిందేం? తొలిచూపులోనే శత్రుభావాన్ని రేపడానికి పదినిమిషాల్లోనే దాన్ని పాముపగగా రూపొందించడానికి ఆ చిన్న వాడేం చేశాడు? ' అన్నాను. "పుస్తక పరిజ్ఞానాన్ని నిఘంటువుల్నీ బట్టీపట్టడాన్ని తప్ప మరిదేన్నీ చూడవు. అతను ఇందాకా గుడ్ నైట్ అన్న తీరుచూస్తే పిలిచి చావ కొడదామనిపించింది. అసలే అతని మాతృభాష వీనుల విందుగా ఉంటుంది. మాతృభాషలో మాధుర్యాన్నే ఇంగ్లీషుకి కూడా కలిగిద్దామని ప్రయత్నించి చాలవరకు కృతకృత్యుడయ్యాడు" అన్నా డు. "అతనికి ఎంతమంచి ఇంగ్లీషువుందో నీకు తెలుసా?" అన్నాను. "చలేస్తోందిరా బాబీ" అన్నాడు వాడు. టవర్ క్లాక్ ఎనిమిది కొట్టింది.

* * *

రూం తాళంతీసి గుమ్మందగ్గర కుర్చీ వేసుక్కూర్చున్నాను. చేతిలో నవల చదవబుద్ధి కావడం లేదు. దూరాన రాజు గాలిలో తేలుతూ వస్తున్నాడు. ముష్టివాడు 'నా జీవితమే సఫలము' పాడి, "అయ్యా మూడురోజుల్నుంచి తిండిలేదు" అన్నాడు. రాజు దగ్గరకెళ్ళి జేబులోంచి ఓ నాణెం తీసి (ఎంతో చూడకుండా) ముష్టివాడి గిన్నెలోకి విసిరి రూములోకి గెంతి, "మనసున మల్లెల మాలలూగెనే..." అని పాడేస్తున్నాడు. భావం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

వీడి ఆనందానికి హేతువేమిటి? లెక్చరర్ క్లాసులోకి రానివ్వకపోతే సినీమా కెళ్ళొచ్చాడా!

"వెన్నెల వెలుగులు విరజిమ్మే ఆ అమ్మాయి...దేవతామూర్తి..." వాడు మంచంమీద బూట్లతోనే పడుకుని కళ్లు మూసుకుని నెమ్మదిగా అంటున్నాడు. ఏదో ప్రమాదం ముంచుకొచ్చిందని కంగారుపడ్డాను. మంచం దగ్గరకు వెళ్లి చూస్తే రాజు నిద్రపోతున్నాడు. పెదిమలు ఏదో చెప్పబోతున్నట్లు విడి ఉన్నాయి. చిరునవ్వు కనిపిస్తోంది.

ఎవరీ రాజు! మానవతత్వాన్ని పరిశోధిస్తున్నా నంటాడు. పెద్ద పెద్ద సమస్యలు తీసుకుని కథలు రాస్తుంటాడు. ఆటంనుంచి అంగారక గ్రహం వరకు అన్నీ కావాలివాడికి. ఇప్పటి వరస చూస్తే ఎవరినో ప్రేమించినట్లు కనిపిస్తుంది. కాని వాడి నిద్రలో నాలుగేళ్ళ పాప కనిపిస్తున్నాడు. మనుషులంతా నిద్రాదేవి ముద్దుబిడ్డలే మరి ...తల్లి దగ్గర అందరూ పసివాళ్లేగా!

* * *

"అదిగో, ఆ అమ్మాయే ...తెల్లచీర...తెల్లటి మనిషి..బస్సువేపు నడుస్తోంది...ఏయ్

ముద్దూ, అటు చూడు; గాలిలోకి చూస్తావేం? ఆ అమ్మాయేరా...బస్సెక్కబోతూ వెనక్కి చూ సింది...ఆ అమ్మాయే ఊ, కనపడిందా! అమ్మయ్య...బస్సులో కెళ్ళిపోయింది..ఇట్టే. కూర్చుం దిలే...చేతిలో పుస్తకం కనిపిస్తోంది...."రాజు చెప్పుకు పోతున్నాడు.

బస్సు కదిలిపోయింది. నాకు తీరికగా ఊపిరి పీల్చడానికి వీలైంది.

"బాగా చూశావా!" వాడు ఆతృతగా అడిగాడు. వాడి అనుమానం చూస్తే నవ్వొచ్చింది.

"చూశా(నా నాయనా...చూశాను...కనులారా చూశాను" అని చెప్పుకోవలసి వచ్చింది.

వాడు ఉత్సాహంగా ఈల వేస్తున్నాడు. ఆర్ట్సు కాలేజీపైన పిట్టగోడ మీదనించి చూస్తే చుట్టూ వెలుగులు తొంగి చూస్తున్నాయి భవనాల్లోంచి.

"పగలుకంటే రాత్రే అందంగా ఉంటుందిరా." అన్నాడు రాజు.

'అవును. పగలు చక్కగా కంట్లో కొచ్చేలోట్లన్నీ చీకట్ల లోతుల్లో దాగుంటే తక్కిన దంతా అందంగానే కనిపిస్తుంది మరి" అన్నాను.

"రూముకి పోదాం" అన్నాడు రాజు. "అక్కడ నీకు అంతా వివరించి చెప్తాను. ఈవాళేం చదవద్దు..." రాజు చెప్పేస్తున్నాడు.

వాడిలో అంత ఉత్సాహం యెప్పుడూ చూడలేదు.

రూమువేపు నడిచాం. అక్కడ వరాండాలో లైట్లు వెలిగించలేదు. మా గదిముందు ఎవరో పెట్టెమీద కూర్చున్నారు. ఎవరేనా బంధువులొచ్చారేమోనని భయపడ్డాం. జంకుతూ, నెమ్మదిగా అడుగులు వేస్తున్నాం.

కుప్పుస్వామి వరండాలోంచి వెలుతురులోకి వ్యాపించుకుని వచ్చాడు. "మీకోసం చూస్తున్నాను నాలుగ్గంటలనుంచీ. నేను మీరూంలో చేరతా!" అని సంక్షిప్తంగా చెప్పాడు చిరం జీవి కుప్పుస్వామి. మొదట చూసినప్పటికంటె చిక్కిపోయాడు. అది అతని అరవహోటలు ప్రభావమేననే ఆలోచనలో నవ్వొచ్చింది. రాజు నిర్ఘాంతపోయాడు.

....మా మౌనాన్ని అర్ధానంగీకారంగా స్వీకరించి పిట్టకైనా తెలియకుండా వచ్చిన దారి నే పోతాడని ఆశపడ్డాడు రాజు. అందుకే ఊపిరి బిగపట్టి నేల చూడసాగాను. కుప్పుస్వామి తనది అరవరక్తం అని ఋజువుచేశాడు. "వేగిరం రూం తాళం తియ్యండి. పెట్టె లోపలపెడ్తాను. మెస్సుకి పోదాం. మీరింకా మెస్సుకి పోలేదుగా" గబగబా అనేస్తున్నాడు కుప్పుస్వామి.

"లేదు. ఏం, మీ హొటలు బాగుండలేదా?"

"వాడు వేయించినగడ్డి, పురుగుల పులుసు వడ్డించేవాడు. చచ్చేమనుకోండి! మరో నాలుగు రోజులుంటే నాలిక తెగిపోయేది" కుప్పుస్వామి తన మాటలకి తనే నవ్వేశాడు...

రాజు ప్రేమలేఖలు రాయడం నేర్చుకుంటున్నాడు.

"ఈ ప్రపంచంలో ప్రేమికులకంటే స్వార్థపరులు ఉండరు. వాళ్ళ ప్రేమించిన వ్యక్తుల కోసం భాషని ఖూనీ చెయ్యడమే కాకుండా ప్రేమ విలువని తగ్గించేస్తారు. ప్రేమ వాళ్లతోటే అంత మైపోయే వస్తువను కుంటారు; అది ప్రేమకు అన్యాయం చెయ్యడమే. వాళ్ల ఒచ్చే తరాల-గురించి ఏమైనా ఆలోచించి ఉంటే ఆ లేఖలు భద్రపరిచి ఉండేవారు. కాని ఆ పని ఏ

ప్రేమికుడూ ఇంతవరకు చెయ్యలేదు. ప్రేమికులది సంకుచిత బుద్ధి" అన్నాడు రాజు.

"నేను వాళ్లలో చేరన్లే" ఎవరో అడిగితే చెప్పినట్టు చెప్పాడు...

రాజుకి ప్రేమలేఖలు రాయడం తెలియడంలేదు. రాజు కథలు రాస్తాడుమరి. కథల్లో ప్రేమలేఖలు చాలా నిర్లక్ష్యంగా, సెకండ్లమీద రాసేస్తాడు. అవి వాస్తవికంగా ఉంటాయని డబాయిస్తాడు మరి.

...వాడికే జీవితంలో ప్రేమలేఖలంటే అంత సంకోచం!

వాడు చెమటోడ్చి కష్టించి ఓ లేఖ పూర్తి చేశాడు.

లేఖతోబాటు పోస్టుచేసిన కథ "నన్ను విడనాడకురా, స్వామీ!" అంటూ వీణ్ణి వెతుక్కుంటూ వచ్చేసింది. లేఖకి జవాబు లేదు.

నాలుగైదు లేఖలు రాశాడు. అని ఏమయ్యాయో తెలియదు.

తెలుగులో రాయడం మానేసి ఇంగ్లీషులో మొదలెట్టాడు అక్కడి కది తనభాష అయినట్లు.

* * *

"ఇంటర్వ్యూ ఒచ్చిందిరోయ్!" రాజు ఓరోజున రూము కెళ్ళగానే చెప్పాడు. "దేనికి? ఓ, అదా!" అన్నాను.

"అవును ఆదివారం సాయంత్రం బీచికి రమ్మంది."

"ఎన్ని గంటలకి"

"ఐదుగంటలకి"

* * *

"మొదట చూడగానే ఏం మాట్లాడాలో తెలియలేదురా"

"ఏం చేశావు. గుటకలు మింగుతూ కూర్చున్నావా!"

వాడు సిగ్గు పడ్డాడు.

"అబ్బే అదేం కాదు...నేను మాట్లాడలేదు. కృష్ణే మాట్లాడింది. ఎంత బాగా మాట్లాడిందనుకున్నావ్! మాట్లాడేది అరవమైనా ఆ వాయిస్‌లో మ్యూజిక్ ఉందిరా!"

నేను తెల్లబోయాను.

"కుప్పుస్వామి సాంగత్యదోషం వల్ల కొద్దిగా అరవంలోకి చూడగలిగాను. అరవం కుప్పుస్వామి మాట్లాడితే బాగుండదు గాని ...."

"అయితే భాష మంచిదేనంటావు!"

"ప్రాణం పోయినా ఆ మాట మాత్రం అనను."

"అయితే అరగంటసేపు అంతదగ్గరలో ఉండి అరవం ఎలా వినగలిగావురా" అన్నాను.

"చెప్తే వినవేం? ఆభాషలో మ్యూజిక్ ఉందంటే" వాడు గట్టిగా అన్నాడు.

"ఓరి దౌర్భాగ్యుడా ఎలా మారిపోయావురా!" అని మాత్రం అనగలిగాను.

"పోనిద్దూ, అది ఏమంత ముఖ్యమైంది కాదు!" అన్నాడు వాడు.

"ఇంతకీ ఆ అమ్మాయి ఏమందేమిటి?"

"కృష్ణా? కృష్ణ ఏమందంటే ...ఈ ఉత్తరాలు రాయడం, అదీ తనకేం నచ్చలేదందిరా!"

"మరి ఎలా భరించగలిగావురా! మూర్ఛపోలేదూ!"

"ఇంక ఉత్తరాలెందుకు? తనూ ప్రేమించిందట నన్ను"

"ఓరి పిడుగా! నువ్వెప్పుడు కనపడ్డావురా ఆ అమ్మాయికి? అమ్మాయిలు కనిపిస్తారు. అబ్బాయిలు ప్రేమిస్తారు. అంతేగాని..."

'ఆఁ మరె! నన్ను చూడకపోవడమేమిటి? ఏ స్టేజీమీద చూసినా మనమేగా! నాగరాజు, ది బెస్ట్ స్పీకర్ ఆఫ్ యూనివర్సిటీ!"

వాడు ఆ తర్వాత నాలుగైదుసార్లు కృష్ణని చూసివచ్చాడు.

ఓరోజున కృష్ణ చెప్పేసింది. "మనం ఇలా సముద్రం దృష్టిలో పడుతూండడం బాగుండ లేదు. వెళ్ళి మానాన్నకి చెప్పుకోండి మీ గురించి. ఏమంటాడో చూద్దాం...."

ఓ శుభముహూర్తాన రాజు తెల్లారి నాల్గు గంటలకి చలిలో ఒణుకుతూనే చన్నీళ్లలో స్నానం చేసి చిక్కని ఊలెన్ పాంటు, తెల్ల షర్టు వేసి అద్దంలో చూసుకొంటున్నాడు. నేను పక్కమీదనుంచి చూస్తున్నాను.

"ఒరే బాబీ, నువ్వుకూడా వొస్తే బావుంటుందిరా."

"ఇప్పు డెవడు లేస్తాడు చలిలో. ఐనా అప్పుడే వేషం వేసేశావేం. ఆరుగంటలకిగా నువ్వెళ్లేది!" అన్నాను.

రాజు ఈలవేస్తూ కవాతు చేస్తున్నాడు రూములో. ఇంకా తెల్లారదే అని విసుక్కొంటు న్నాడు. మధ్యనోసారి "ఈ నిశీధికి అంతంలేదా" అని గర్జించాడు. అయిదు మాత్రమే కొట్టి ఊరుకున్న గడియారాన్ని నోరారా తిట్టాడు.

ఏమైతేనేం తెల్లవారింది. యూనివర్సిటీ చుట్టూవున్న ప్రకృతి ఇంకా నిద్రపోతోంది. సముద్రం ఎంతో అందంగా, స్నిగ్ధంగా మెరుస్తోంది.

ఆరు కొట్టింది గడియారం.

"ఏం చెప్పను!" అన్నట్టు చూసి 'వెళ్తాను మరి' అన్నాడు రాజు. నాకు ఏంచెప్పాలో తెలియలేదు. వాడు నవ్వుతూ నడిచాడు.

పది గంటలకి లైబ్రరీనుంచి వస్తున్నాను ఉషారుగా ఈలవేస్తూ. రాజు పరుగెత్తి వచ్చి "బాబీ, గెలిచేశానురా!" అంటున్నాడు. దూరాన్నుంచి కొందరు వింతగా చూస్తున్నారు.

"ఏం జరిగిందిరా?"

"కృష్ణ వాళ్ళనాన్న దగ్గరకు తీసుకెళ్లింది. ఆయన తనకు అరవం తప్ప మరేం రానం దుకు విచారిస్తున్నానని ఇంగ్లీషులో చెప్పాడు. బలేవాడులే."

"నువ్వేం చేశావు?"

"నేనూ తగ్గట్టే చేశాను. అరవంలోనే మాట్లాడేను. ఆయన చాలా ప్లీజ్ ఐ పోయాడులే. నేను కథలు రాస్తానని చెప్తే...."

"చాలా బాధపడ్డాడు కదూ"

"అబ్బే...కాదు...కృష్ణ నేను టెన్నిస్ ప్లేయర్ అని చెప్పింది. ఆయన నేనెంత ఆటగాణ్ణయినా తనని ఓడించలేనన్నాడు. వాళ్లింటి ఆవరణలో ఓ టెన్నిస్ కోర్టుంది. అక్కడ ఆడాం. గెలుపు మందేలే. కాని ఆయన ఓడిపోవాలనే ఓడిపోయినట్టు కనిపిస్తుంది."

"అంతేలే. పెద్దవాళ్లు చిన్నవాళ్ళకోసం హక్కుల్ని త్యాగం చేస్తుంటారు."

"ఏదోలే-"

"ఎక్కడికి పోయారు మీరు?" అంటున్నాడు కుప్పుస్వామి.

"ఇదంతా కుప్పుస్వామి స్నేహప్రభావం" అంటున్నాడు రాజా. కుప్పుస్వామి ఏమిటో తెలియక నోరు తెరుచుకు చూస్తున్నాడు.

"ఈరోజు మొదలు మనిద్దరికీ నేస్తం. కాఫీ తాగొద్దాం రండి" అని కుప్పుస్వామి భుజంమీద ఆప్యాయంగా చేతులువేసి లాక్కుపోతున్నాడు.

నేను అలా నిలబడి చూస్తున్నాను. "ఏమిటీ స్నేహం!" అనుకుంటూ కుప్పుస్వామి రాజాతో నడవలేక నానాయాతనా పడుతున్నాడు.

"రాజా నన్ను పిలవనేలేదు!" అనుకుని నవ్వుకుంటున్నాను. రాజా వెనక్కి తిరిగి "బాబీ! నిలబడిపోయావేం, రా" అని కేకలేశాడు, వెళ్లాను.

దూరంగా సముద్రం మహోజ్వలంగా మెరుస్తోంది. సూర్యుడు నడినెత్తిన నిలుచున్నాడు. ముగ్గురం నడిచాం.

(ఆంధ్రపత్రిక; వీక్లీ 4-1-1956)

★